

అంగన్‌వాడీ కేంద్రాల్లో...
పాలెక్కడ..?

పిల్లలు, గర్భిణులకు 'సంపూర్ణ పోషణ' ఎక్కడ?

- రెండు నెలలుగా అందని వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- తిరుపతి

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీ, బాలింత పిల్లలకు అందజేసే పాలనూ సకాలంలో అందివ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ప్రభుత్వ వైఫల్యమా లేక అధికారుల అలసత్వమా అంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద ప్రభుత్వం అందిస్తోన్న పాలు రెండునెలలుగా లబ్ధిదారులకు అందకపోగా ఉన్నతాధికారులెవరూ స్పందించకపోవడం గమనార్హం.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 21 అంగన్‌వాడీ ప్రాజెక్టుల్లో 4100 ఐసిడిఎస్ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో చిన్నారులకు రోజుకు 100 మి.లీ. చొప్పున నెలలో 25 రోజులపాటు పాలు అందిస్తారు. దీని ప్రకారం నెలకు 2.5 లీటర్లు చిన్నారులకు ఇవ్వాలి. బాలింతలు, గర్భిణులకు రోజుకు 200 మి.లీ. చొప్పున 25 రోజులకు 5 లీటర్ల పాలు అందజేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నెలకు 8 లక్షల లీటర్ల పాల సరఫరా చేస్తున్నారు. విజయ పాల డెయిరీ నుంచి టెట్రా ప్యాకెట్ల ద్వారా పాలను అందిస్తున్నారు.

అయితే అతి ముఖ్య పోషకాహారమైన పాలు అంగన్వాడీ కేంద్రాలకు సక్రమంగా సరఫరా కావడం లేదు. మార్చి నెలలో దాదాపుగా పాల సరఫరా అన్ని కేంద్రాల్లోనూ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఏడాదిన్నరగా రెండు లేదా మూడు నెలలకోమారు పాల సరఫరా అవుతున్నట్లు ఐసిడిఎస్ కేంద్రాల నిర్వాహకులు వాపోతున్నారు. అయితే వీటిపై దృష్టి సారించాల్సిన ఉన్నతాధికారులు మాత్రం స్పందించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

10 శాతం పాలు వృధా !

అరాకొరగా సరఫరా అవుతున్న పాలలోనూ దాదాపు 10 శాతం వృధా అవుతోంది. సరఫరా అయిన పాలల్లో కొన్ని టెట్రా ప్యాకెట్లు పగిలిపోవడంతో బ్యాక్టీరియా ప్రవేశించి చెడిపోతూ ఉండటం ప్రతి నెలా సంభవిస్తోంది. ఇలా దాదాపు 10 శాతం పాలు చెడిపోతూ ఉండటం గమనార్హం. వేసవి కాలంలో ఈ 'సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. పాలు చెడిపోయాయని చెబితే ఎక్కడ వివరాలు, వివరణలు, తీర్మానాలు ఇవ్వాల్సి ఉంటుందోనన్న భయంతో లబ్ధిదారులకు ఇవ్వకుండానే ఇచ్చామంటూ నిర్వాహకులు ఆన్లైన్లో నమోదు చేసుకుంటుండటం గమనార్హం.

సకాలంలో పాలను అందించాలి

వాణిశ్రీ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ నేత

బాలింతలు, గర్భిణీలు, పిల్లలకు మెరుగైన పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అటు ప్రభుత్వం, ఇటు అధికారులదే. అయితే సకాలంలో పాలు అందక పోవడం వల్ల లబ్ధిదారులు ఇబ్బంది పడటమే కాకుండా అంగన్‌వాడీ నిర్వాహకులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సకాలంలో పాలను లబ్ధిదారులకు అందించాలి.

పాలు అందేలా చర్యలు తీసుకుంటాం

నాగశైలజ, ప్రాజెక్టు డైరెక్టర్ , జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ

అంగన్వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కర్నాటక నుంచి సరఫరా కావాల్సిన పాలు ఆలస్యమైన మాట వాస్తవమే. ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించి ఉన్నాం. త్వరలోనే అన్ని కేంద్రాలకూ పాలను సరఫరా చేస్తాం. పాలూ వృధా కాకుండా అబ్దిదారులకు అందేలా చర్యలు చేపడతాం.

తిరుపతిలో నిరసన

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

సబ్‌స్టేషన్ల వద్ద టిడిపి నిరసనలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి, యంత్రాంగం

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని టిడిపి రాష్ట్ర పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు జరిగాయి. శ్రీకాళహస్తిలో ఎలక్ట్రానిక్ వస్తువులతో శవయాత్ర నిర్వహించారు. 'సైకో పాలన పోవాలి... సైకిల్ పాలన రావాలి' అంటూ నినాదాలు చేశారు.

తిరుపతి పద్మావతిపురంలోని 130కెవి సబ్‌స్టేషన్ వద్ద మాజీ ఎంఎల్‌ఎ ఎం.సుగుణమ్మ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 2014లో 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటుతో చంద్రబాబు నాయుడు పాలన మొదలైందని, కనీసం ఛార్జీలు పెంచకుండానే గత ప్రభుత్వ పరిపాలన సాగిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజలపై అనేక రకాలుగా భారం మోపారని వాపోయారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉండే జెన్కో, సిజిఎస్‌లలో ఒక యూనిట్ ధర 5 రూపాయలకు వస్తుందని, కమీషన్ల కోసం ఒక యూనిట్ ధర తొమ్మిది రూపాయలు పెట్టి బహిరంగా మార్కెట్‌లో కొనుగోలు చేశారన్నారు. ఈ కొనుగోలుకు 12.200 కోట్లు ఖర్చు చేస్తుందని, ఇలా బినామీలకు వేలకోట్ల రూపాయలకు దోచిపెట్టి ఆ నష్టాన్ని పూడ్చేందుకు ప్రజలపై భారం మోపుతుందని ధ్వజమెత్తారు. 2023, ఏప్రిల్ నుండి యూనిట్కు 40 పైసలు విద్యుత్ ఛార్జీలు పెంచారని తెలిపారు. ఇప్పటికే 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, మహేష్ యాదవ్, రాష్ట్ర, జిల్లా యువత, విద్యార్థి, మహిళా అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో విద్యుత్ ప్రధాన కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షులు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ వస్తువులకు పూలమాల వేసి శవయాత్ర చేశారు. బాలాయపల్లిలో టిడిపి నాయకులు కె.శ్రీహరి ఆధ్వర్యంలో వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దని నిరసన తెలిపారు. మస్తాన్‌నాయుడు, కొర్రపాటి రామచంద్రనాయుడు పాల్గొన్నారు. బిఎన్ కండ్రిగలో మండల అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, ఎంపిటిసి మనోహర్‌నాయుడు ఆధ్వర్యంలో నీర్పాకోట కారణమెట్ట విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కెవిబిపురం మండలంలో టిడిపి అధ్యక్షులు రామాంజులనాయుడు, బిసి సెల్ అధ్యక్షులు మునస్వామియాదవ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆంధ్ర రాష్ట్రానికి జగన్ ప్రభుత్వం ఒక క్యాన్సర్ గడ్డని, ఆ గడ్డని నివారించడానికి జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. గూడూరులో టిడిపి మాజీ ఎంఎల్‌ఎ పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో గోగినేనిపురం వద్ద ఉన్న డివిజనల్ విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఛార్జీలు పెంచడం వల్ల ఆక్వా రైతులు నష్టపోతారన్నారు. కోటలో మైనార్టీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వరదయ్యపాళెంలో టిడిపి అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి, నాయకులు శివయ్య ఆధ్వర్యంలో 'నువ్వే రాష్ట్రానికి దరిద్రం జగన్' అని నిరసన తెలిపారు. విద్యుత్ ఎఇ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. దొరవారిసత్రంలో టిడిపి మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. 'సైకో పాలన పోవాలి... సైకిల్ పాలన రావాలి' అంటూ నినాదాలు చేశారు. పిచ్చాటూరులో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి డి.ఇళంగోవన్‌రెడ్డి ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. కోటలో మైనార్టీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని సబ్‌స్టేషన్ సమీపంలో ధర్నా నిర్వహించారు.

శ్రీకాళహస్తిలో వినూత్నంగా 'శవయాత్ర'

'అక్షయ తృతీయ'కు మెజెస్టిక్ తంజావూరు ఆభరణాలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

అక్షయ తతీయ కోసం రిలయన్స్ జ్యువెలర్స్ నుండి మెజిస్టిక్ తంజావూర్ కలెక్షను ఆవిష్కరించింది. అద్భుతమైన 'తంజావూరు' సేకరణ ఆభరణాలను ధరించి ర్యాంపు అలంకరించిన అద్భుతమైన షోస్టాపర్ జాన్వీకపూర్. రిలయన్స్ జ్యువెల్స్ "తంజావూరు" సేకరణ వివాహాల నుండి పండుగ కార్యక్రమాలు, ప్రత్యేక సందర్భాలలో సరిపోయే విస్తారమైన సున్నితమైన ఆభరణాలను అందిస్తుంది. ఈ సేకరణలో అద్భుతమైన నెక్లెస్ సెట్లు, చోకర్లు, లేయర్డ్ నెక్లెస్లు, బ్యాంగిల్స్, బ్రాస్లెట్లు, చెవిపోగులు, ఉంగరాలు, నడుము బెల్ట్ లు, మాంగ్టిక్కాస్, ఇయర్ చెయిను ఉన్నాయి. రిలయన్స్ జ్యువెల్స్ సీఈవో సునీల్ నాయక్ మాట్లాడుతూ 'తమిళనాడులోని తంజావూరు యొక్క గొప్ప వారసత్వం సారాంశాన్ని సంగ్రహించే ఈ అక్షయతతీయ పాన్ ఇండియాలో తమ తంజావూరు సేకరణను ప్రదర్శించడం తమకు గర్వకారణంగా ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

శ్రీవారి దర్శనానంతరం తిరిగి వెళుతున్న కారు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో దంపతులు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసు కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా కెజిఎఫ్‌కు చెందిన గోపినాథ్, శ్యామల దంపతులు కారులో రెండు రోజుల క్రితం తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. ఆదివారం స్వామివారిని దర్శించుకుని, సోమవారం స్థానిక ఆలయాలు సందర్శించి, మధ్యాహ్నం తిరిగి తమ సొంతూరుకు పయనమయ్యారు. నాయుడు పేట-పూతలపట్టు జాతీయ రహదారిలోని కాశిపెంట్ల బైపాస్‌రోడ్డులో ఆగి ఉన్న లోడ్ లారీని కర్ణాటకకు చెందిన దంపతుల కారు వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. కారులో ఇరుక్కుని గోపినాథ్ (40), శ్యామల(35) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాలను కారులోంచి వెలుపలికి చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. వేగంగా వస్తున్న కారు ముందు ఆగి ఉన్న వాహనాన్ని గమనించకపోవడంతో ఢీకొన్నట్లు పోలీసులు అభిప్రాయపడ్డారు. ఎస్ఐ వంశీధర్ ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాలుకు జ్యోతిరావు పూలే పురస్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు కయ్యూరు బాలసుబ్రమణ్యం జ్యోతిరావు పూలే పురస్కారంకు ఎంపిక అయ్యారని పూలే టీచర్స్ ఫెడరేషన్ నిర్వాహకులు సోమవారం పేర్కొన్నారు. విద్య, సాహిత్యం, కళ, సామాజిక సేవ తదితర రంగాల్లో బాలసుబ్రమణ్యం చేస్తున్న కృషికి గాను ఈ నెల 16వ తేది తిరుపతి లో దుర్గాబాయి దేశ్ ముఖ్ ప్రాంగణం నందు ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్టు పూలే టీచర్స్ ఫెడరేషన్ వారు తెలియజేశారు.

ఎస్‌వి జూకు కొత్త జంతువులు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఎస్‌వి జంతుప్రదర్శనశాలకు కొత్త జంతువులు తీసుకొచ్చినట్లు జూ పార్కు క్యూరేటర్ సెల్వ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనిమల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ నెల 8వ తేది కాన్పూర్ జులాజికల్ పార్క్ నుంచి ఒక ఆడ ఆసియా సింహం, ఒక మగ తెల్లపులి, ఒక జత చింకారాలు, మూడు మోకోవీ బాతులు, మూడు స్వంప్ డీర్స్, ఒక జత హాగ్ డీర్స్, ఒక జత కాలిజ్ ఫీషంట్‌ను తీసుకొచ్చామన్నారు. ఎక్స్ఛేంజ్‌లో బాగంగా తిరుపతి ఎస్‌వి జూపార్కు నుంచి కాన్పూరు జులాజికల్ పార్క్‌కు ఒక జత అడివి దున్నలు, ఒక ఆడ తెల్లపులి, మూడు రేస్ కుక్కలు, మూడు వైట్ఇబీస్‌లు, మూడు గ్రేపిలికాన్‌లు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

రుయాలో 'కోవిడ్ మాక్ డ్రిల్'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి ఎస్‌వి వైద్య కళాశాల రుయా ఆసుపత్రిలో కోవిడ్ 19 మాక్ డ్రిల్ సోమవారం రుయా ఆసుపత్రిలో భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు కోవిడ్ 19 మాక్ డ్రిల్ నిర్వహించారు. రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ నాగ మునీంద్రుడు ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీహరి పర్యవేక్షణలో ఈ కోవిడ్ మాక్ డ్రిల్ జరిగినది. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి పరిధిలోని బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్లు, ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులో ఉన్న పైప్‌లైన్ ఉపయోగాలు గురించి డాక్టర్ శ్రీహరి, డాక్టర్ నాగమణింద్రుడు అడిగి తెలుసుకున్నారు. ఈ మాక్ డ్రిల్ వల్ల కోవిడ్ 19 లో కలిగే పరిణామాల్ని ముందుగా పసికట్టుకొని రోగికి కావలసిన వైద్యం అందించడానికి తయారుగా ఉన్నట్లు ముందు సూచికలను తయారు చేసుకొనవచ్చునని తెలిపారు. కోవిడ్ సోకినట్లయితే వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్యం తీసుకోవాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అనస్తీసియా విభాగాతిపతి డాక్టర్ రాధా, జనరల్ మెడిసిన్ విభాగ అధిపతి డాక్టర్ యాదవేందర్ రెడ్డి, సి ఎస్ ఆర్ ఎంఒ డాక్టర్ లక్ష్మా నాయక్ పాల్గొన్నారు.

గిరిజనులకు సాగు భూములివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఓజిలి

నిరుపేద గిరిజనులకు సాగు భూములు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గిరిజనులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకురాలు లక్ష్మి, చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన గిరిజనులకు నేటికీ సాగు భూములు కల్పించకపోవడం దురదష్టకరమన్నారు. ఓజిలి మండలం కుందాం రెవెన్యూలో సర్వే నంబరు 1 లో వందలాది ఎకరాల మేత పోరంబోకు భూమి ఉందని, రాజుపాళెం గ్రామ స్థానిక గిరిజనులకు సంబంధిత అధికారులు భూములు కల్పించకపోవడం దారుణమన్నారు. గిరిజన కుటుంబాలకు జీవనాధారం లేక రోజువారి కూలి పని చేసుకుంటూ బతుకుతున్నారని, ఏ ఆధారం లేని గిరిజన కుటుంబాలకు సాగు భూములు కల్పిస్తే వారి జీవనం మెరుగుపడుతుందని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు బి . గోపాల్, గిరిజన నాయకులు మణి పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాల్లో 'ఉపాధికి' తిరుపతిలో శిక్షణ : కలెక్టర్

హౌస్‌కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ శిక్షణతో పాటు గల్ఫ్ దేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమానికి 18-45 సంవత్సరాల లోపు మహిళల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ దరఖాస్తులు కోరుతోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కొంతమంది మహిళలు ఉపాధి కోసం నకిలీ ఏజెంట్ల మోసాల్లో చిక్కుకుని సరైన అర్హతా పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లి అక్కడి చట్టాలు తెలియక మోసపోయి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో మూడు చోట్ల అనగా తూర్పు, పశ్చిమగోదావరి, కడప జిల్లాల్లో హౌస్‌కీపింగ్, కుకింగ్, కేర్‌టేకర్ అంశాలపై శిక్షణ ప్రారంభించనున్నామని తెలిపారు. మన జిల్లాలోనూ స్థానికంగానే శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం వీరికి గల్ఫ్ దేశాలలో ఉపాధి చూపించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి పొందడానికి వెళ్లిన ఉద్యోగికి అక్కడ జీతభత్యాలలో, పనిచేసే విషయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే భారత రాయబార కార్యాలయం బాధ్యత వహిస్తుందని తెలిపారు. వివరాలకు 7675827308 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

2024 ఈవీఎంల భద్రతకు గోడౌన్ల పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ రేణిగుంట

రానున్న 2024 సంవత్సరంలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవిఎంలు, వివిప్యాట్‌లను అద్దె ప్రాతిపదికన గోడౌన్లలో భద్రపరిచేందుకు జేసీ డికె బాలాజీతో కలిసి రేణిగుంట విమానాశ్రయ సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి గోడౌన్లను కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పరిశీలించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాల మేరకు జిల్లాకు కేటాయించిన కొత్తగా మ్యానిఫ్యాక్చర్ చేసిన బెల్ ఎం3 ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను జిల్లాలోనే భద్రపరచనున్నారు. గోడౌన్ మేనేజర్, సర్వేయర్‌తో మాట్లాడుతూ ఈవిఎంలు, వివిపాట్‌లు భద్రపరచుటకు దాదాపు 16 వేల చదరపు అడుగులు అవసరం అవుతుందని, భద్రత ప్రమాణాలు పాటించేలా ఏర్పాట్లు ఉండాలని, వాకిళ్లు, అగ్నిమాపక సాధనాలు, కరెంట్, సిసిటివిల ఏర్పాటు తదితర భద్రత, ఇతర ఏర్పాట్లు ఎన్నికల అధికారి నిబంధనల ప్రమాణాల మేరకు ఉంటాయని తెలిపారు. తదనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట తహశీల్దార్ శివప్రసాద్, మేనేజర్ కేంద్ర గిడ్డంగులు రమేష్‌కుమార్ ఉన్నారు.

'స్పందన' వినతులను అర్థవంతంగా పరిష్కరించాలి

'స్పందన' కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాల వ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్థవంతంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె. బాలాజీ తో కలసి జిల్లా కలెక్టర్ స్పందన గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు డి ఆర్ ఓ శ్రీనివాసరావు, ఎస్ డి సి లు కోదండ రామిరెడ్డి, భాస్కర్ నాయుడు జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి స్పందన ఆన్ లైన్ నమోదుతో రసీదులు అందించారు. మొత్తం 127 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించే 96 ఉన్నాయి.

రేణిగుంటలో ఈవిఎంలను భద్రపరిచేందుకు గోడౌన్లు పరిశీలిస్తున్న కలెక్టర్

కమిషనర్‌ను కలిసిన టిడిపి మాజీ ఎంఎల్‌ఏ సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

తిరుపతి మున్సిపల్ కమిషనర్ డి.హరిత నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో టిడిపి మాజీ ఎంఎల్‌ఏ సుగుణమ్మ సోమవారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, ,కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, నాయకులు శీధర్ వర్మ, ఊక విజయ్‌కుమార్, బుల్లెట్ రమణ, ఉన్నారు. తరువాత తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షులు, స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టియు) తిరుపతి అర్బన్ శాఖ నాయకులు మునికృష్ణనాయుడు కమిషనర్‌ను కలిసి సత్కరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మురళీకష్ణ ,బాలాజీ ప్రసాద్, లక్ష్మీపతి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత : కమిషనర్ హరిత

ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ దామలచెరువు హరిత అన్నారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణలు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కమిషనర్ హరిత స్పందిస్తూ ప్రజల నుండి వచ్చిన పిర్యాధులు, అర్జీలను సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. మంచినీళ్లగుంటను సంరక్షించాలని కార్పొరేటర్ నరసింహాచారి, శాశ్వత పార్కింగ్ ఏర్పాటు చేయాలని ట్యాక్సీ అసోసియేషన్ వారు అర్జీ ఇచ్చారు. వీధివిక్రదారులకు గుర్తింపు కార్డులో ఇవ్వాలని, మాల్వాడిగుండం కాల్వలో చెత్త, పూడిక తీయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ పాల్గొన్నారు.

కమిషనర్‌ను అభినందిస్తున్న లైన్స్‌క్లబ్ అధ్యక్షులు

కల్వర్టు బాగు చేయండి

ప్రజాశక్తి-గూడూరు: మున్సిపల్ పరిధిలోని శాంతినగర్‌కు వెళ్లే దారిలోని కల్వర్టు శిధిలావస్థకు చేరడంతో ఆ దారిలో నిత్యం రాకపోకలు జరిగే వాహనాలు ఆటోలు, మోటార్ సైకిళ్ల చక్రాలు వచ్చి, పోయేటప్పుడు, కల్వర్టులో ఇరుక్కుపోవడంతో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని సోమవారం సిపిఎం సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మున్సిపల్ కమిషనర్ సాయినాథ్‌కి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాత్రిపూట ఆ దారిలో వెళ్లాలంటే ఆ కల్వర్టు కనబడక వాహనదారులు, ప్రజలు, పిల్లలు, వద్ధులు, కింద పడిపోయి గాయాలపాలవుతున్నారన్నారు. ఇకనైనా మున్సిపల్ కమిషనర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ప్రజల సౌకర్యార్థం వెంటనే మరమ్మతులకు గురైన కల్వర్టును రిపేరు చేసి ప్రమాదాలు జరగకుండా నివారించ వలసిందిగా కోరారు. వినతిపత్రం అందించిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పుట్టా శంకరయ్య, జిల్లా ఆటో కార్మికసంఘం నాయకులు బి.వి. రమణయ్య ఉన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-నాయుడుపేట: స్థానిక వేదనపర్తి సుందర్ రాంరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో సోమవారం పెళ్లకూరు మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ ముకుంద అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముకుంద మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వకుండా మధ్యాహ్న భోజన కార్మికుల నుంచి ఈ ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటూ వారిని బానిసలుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం జిల్లా కార్యదర్శి కె విజయమ్మ మాట్లాడుతూ కార్మికులకు యూనిఫాం లేదు, వంట పాత్రలు ఇవ్వడం లేదు, 9 , 10వ తరగతి బిల్లులకు నెలసరి ఇవ్వడం లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఎంఈఓ గతంలో ప్రతినెలా సమావేశం ఏర్పాటు చేసి కార్మికులు తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పేవారని ఇప్పుడు సమావేశాలు పట్టించుకునే పరిస్థితి కనిపించటం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతా, భారతి, సుగుణమ్మ, సుజాత, హేమలత, రాధాకష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగాలమ్మ సేవలో మంత్రి రోజా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్థానిక రైల్వే స్టేషన్ అపార్టుమెంట్స్ సమీపంలో గల శ్రీ నాగాలమ్మ దేవాలయం మండల పూజ మహోత్సవ కార్యక్రమంలో సోమవారం ఉదయం మంత్రి రోజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీ గణపతి, శ్రీ మానస దేవి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి నాగ ప్రతిమలకు ఆమె పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు సూర్యనారాయణ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్ జయప్రకాష్, శివాలయ ఛైర్మన్ కొడగంటి రమేష్ బాబు, మాజీ ఛైర్మన్ జలకం సునీల్ కుమార్, ఎంపీపీ ముని వేలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలు అరికట్టాలి: ఎఐవైఎఫ్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఆన్లైన్ మోసాలను అరికట్టేందుకు డేటింగ్ యాప్, లోన్ యాప్, బెట్టింగ్ యాప్ లతో పాటు నేరాన్ని ప్రేరేపించే యూట్యూబ్ ఛానల్స్ నిషేధించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏం.రామకష్ణ, కత్తి రవి కోరారు. సోమవారం తిరుపతి జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకట్రావుకు వినతి పత్రం ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు రోజుకు సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతూ అంతర్జాల వాడకం పెరుగుతోందని, సైబర్ నేరగాళ్లకు అడ్డు అదుపు లేకుండా ఆన్లైన్ మోసాలకు ఎంతోమంది బలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాగరాజు. పూర్ణ, బాల పాల్గొన్నారు.

కోవిడ్ వార్డు ఏర్పాటు

ప్రజాశక్తి- నగరి: కోవిడ్ కేసులు అక్కడక్కడా మళ్లీ వస్తుండటంతో ఈ స్థాయిలోనే కట్టడి చేయాలని ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టింది. స్థానిక ఏరియా ఆస్పత్రిలో 5 బెడ్లుతో కూడిన కోవిడ్ వార్డును ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం వైద్యులు ప్రారంభించారు. కోవిడ్‌కు సంబంధిత మందులు, పరికరాలు అందుబాటులో ఉంచారు. ఈకార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణ నాయక్, ఆర్ఎంఓ గోపాల్, వైద్యులు కార్తిక్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ మాజీ ఉపకులపతికి ఘన నివాళి

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ఆచార్య ఉదయగిరి రాజేంద్ర మతిపై విచారం వ్యక్తం చేస్తూ విశ్వవిద్యాలయ అధికారుల సంతాప సమావేశం సెనేట్‌హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య రాజారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా స్వర్గీయ రాజేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి విశ్వవిద్యాలయ ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు నివాళులు అర్పించారు. వారి అకాల మతికి రెండు నిముషాలు మౌనం పాటించారు. డా. రాఘవ రెడ్డి, యండపల్లి శ్రీనివాసులురెడ్డి, ఆచార్య పాపారావు, ఆచార్య జాకబ్ దాస్ మొదలైన వారు రాజేంద్ర వ్యక్తిత్వాన్ని, నిబద్ధతను గుర్తు చేశారు. నోబెల్ బహుమతి పొందగలిగిన స్థాయి పరిశోధకుడని, ఫలితాలు అందుకునే సమయం సమీపిస్తున్న తరుణంలో అకస్మికంగా దూరం కావడం దురదష్టమన్నారు. ఆచార్య రాజారెడ్డి మాట్లాడుతూ తాను లేదా నేను విసి గా వున్నా అన్నా అని ఆప్యాయంగా పిలిచేవాడని అన్నారు. మంచి సైంటిస్ట్ గా సేవలందించడమే కాకుండా వైస్ ఛాన్సలర్‌గా వున్న సమయంలో ఉద్యోగుల పిఆర్‌సి బకాయిలను ప్రత్యేక గ్రాంటు తెచ్చి చెల్లించడం ఎవరూ మరిచిపోలేదని గుర్తుచేశారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ దివంగత రాజేంద్ర సంతాప సందేశాన్ని చదివి వినిపించారు. వారి పాలనాకాలంలో యుజిసి ప్రాజెక్టులు, శాప్ ప్రోగ్రామ్ లు విరివిగా వచ్చినట్లు గుర్తు చేశారు. ఎస్వీయూ బోధన, బోధనేతర సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు, పరిశోధకులు నివాళులు అర్పించడంలో పాల్గొన్నారు.

కరాటే విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గానికి చెందిన ఎఫ్ఎస్ఎస్‌కెఐ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు గోవాలో మార్చి 29, 30వ తేదీలలో శ్రీమనోహర పరాకార ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 3వ ఆసియన్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో ఏడు దేశాలకు చెందిన 2 వేల మంది విద్యార్థులు పాల్గొనగా మన తిరుపతి జిల్లా సత్యవేడుకి చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరి చారు. ఈ పోటీలలో కటాస్, కుమితే (అండర్ 12, అండర్13, అండర్ 14) విభాగాలలో 8 మంది విద్యార్థులు పాల్గొనగా 10 బంగారు పథకాలు 6 వెండి పథకాలు సాధించారని కరాటే మాస్టర్ కన్నయ్య తెలిపారు. ఇదిలా ఉండగా సోమవారం తిరుపతి ఎంపీ కార్యాలయంలో ఎంపీ గురుమూర్తి చేతుల మీదుగా వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి వారిని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించి మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వారిని కోరారు. అలాగే మారుమూల ప్రాంతంలో నిరుపేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తూ వారి ప్రతిభను వెలికి తీస్తున్న కరాటే మాస్టర్ కన్నయ్యను అభినందించి శాలువాతో సత్కరించారు.

సాగుభూమికి పట్టాలు ఇవ్వండి: సిపిఐ డిమాండ్



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామ రెవెన్యూ విఎస్ పురం దళితులు సుమారు 50 సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ బిఎన్ కండ్రిగ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసిరాజన్ డిప్యూటీ తహశీల్దార్ శివయ్యకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక విఎస్ పురం గ్రామంలో సర్వే నెంబర్లు 340, 341 భూములను దళితులు, పేదలు సిపిఐ అండతో సుమారు 50 సంవత్సరాలుగా 70 దళితులు కుటుంబాలు ఈ భూమిని నమ్ముకొని సాగు చేసుకుంటున్నారన్నారు. అదే గ్రామానికి చెందిన కొంతమంది రాజకీయ పలుకుబడితో, రెవెన్యూ అధికారుల అండదండలతో బోగస్ పట్టాలు సష్టించుకుని అనుభవంలో ఉన్న దళిత రైతులను ఆందోళనకు గురిచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సాగులో ఉన్న రైతులకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో జగనన్న ఇళ్లకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మించాల శివకుమార్, రుద్రపాక శ్రీనివాసులు, కష్ణయ్య, దాసు, సీనయ్య, పోలమ్మ, పీటర్, మణి, సిద్ధయ్య పాల్గొన్నారు.

తాయిమాంబాపురం చెరువు పనుల పరిశీలన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు పుత్తూరు మున్సిపాలిటీ గోవిందపాలెం తాయిమాంబాపురం చెరువు వద్ద జరుగుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ కె ఎల్ ఎం రెడ్డి సోమవారం పరిశీలించారు. పట్టణం నుంచి వచ్చే వర్షపు నీరు, మురికి నీటితో చెరువులలో కలిసి నీరు కలుషితమై రావడంతో ప్రజలు అసౌకర్యానికి గురి అవుతున్నారన్నారు. ఇరిగేషన్ ఏఈ సంబంధిత విషయం ఫోన్ ద్వారా తెలియపరచి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పుత్తూరు పట్టణ ప్రధాన శ్మశాన వాటికలో క్రిమటోరియం ఏర్పాటు చేయుటకు చెన్నై నుంచి వచ్చిన కంపెనీతో చర్చించి ఏర్పాటు చేయుటకు వారి సలహాలు సూచనలు తీసుకున్నటుల తెలిపారు. అలాగే మంత్రి రోజా ఆదేశాల మేరకు శ్మశాన వాటికలో శివుడి విగ్రహం ఏర్పాటు చేయుటకు స్థల పరిశీలన చేసినట్లు చెప్పారు. అలాగే 2023-2024వ ఆర్థిక సంవత్సరానికి మొత్తం ఇంటిపన్నుల డిమాండ్ రూ.4.10 కోట్లుగా, ఇంటిపన్ను ఒకేమొత్తంలో చెల్లించిన వారికి 5% రాయితీ ప్రభుత్వం కల్పించినందున ప్రజల్లోకి సంబధిత అంశాన్ని తీసుకెళ్ళి ఇంటిపన్ను అధికమొత్తంలో వసూలు చేసి పట్టణాభివద్ధి తోడ్పడాలని అడ్మిన్ సెక్రెటరీస్‌కు తెలియజేసినట్లు తెలిపారు. అనంతరం పురపాలక సంఘంలో ఏర్పాటుచేసిన ఇంటి పన్నుల కౌంటర్స్‌ను పరిశీలించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారి ఇంద్రసేన నాయుడు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా చైతన్యవంతం కావాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: చేతి వత్తులతో మహిళలు ఆర్థికంగా చైతన్యవంతం కావాలని పుత్తూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రీయ సేవా సమితి రాస్ మహిళా పొదుపు సంఘం సభ్యుల సౌకర్యార్థం సోమవారం పుత్తూరు రాస్ ప్రాంతీయ శాఖ కార్యాలయంలో జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్, ఆర్యవర్క్ పై మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ రాస్ ద్వారా వందలాది మహిళలకు నిరంతరం చేతి వృత్తులపై శిక్షణలు అందించడం సంతోషదాయకమన్నారు. అనంతరం రాస్ జన శిక్షణ సంస్థ అధికారి శ్రీహరి మాట్లాడుతూ 84 రోజులు, రోజుకు రెండు గంటల శిక్షణను 20 మందికి అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం టైలరింగ్‌కు అవసరమైన వస్తువులను, అలాగే ఆర్య వర్క్ మెటీరియల్, బ్యూటీషియన్, కిడ్స్ టైలరింగ్ మిషన్ ఉచితంగా అందించారు. 70 మంది మహిళలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, బాలమ్మ, జయంతి, లావణ్య, తేజ, ఉష తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో స్పందన వినతుల పరిష్కారం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతులను సకాలంలో విచారించి పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గత వారం అందిన వినతులు పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో అందే వినతులపై సంబంధిత శాఖాధిపతులు క్షేత్రస్థాయికి వెళ్లి విచారించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

వేడెక్కిన పాకాల రాజకీయం

ప్రజాశక్తి-పాకాల: రానున్న సార్వత్రిక ఎన్నికలను ఉద్దేశించి అధికారంలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో, ప్రతిపక్ష టీడీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో రెండు పార్టీలు పోటాపోటీగా సోమవారం అన్నదాన కార్యక్రమాలు చేయడంతో పాకాలలో రాజకీయాలు వేడెక్కడం మొదలైంది. ఇరు పార్టీలు ఒకేరోజు అన్నదానం చేయడంతో మండల రాజకీయాలు ఎలక్షన్ కోడ్ రాక ముందే తారా స్థాయికి చేరుకోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది. 2019 ఎన్నికల తర్వాత ఎప్పుడూ లేని విధంగా రానున్న సార్వత్రిక ఎన్నికలు దగ్గరలో ఉన్నందున ఓట్ల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పలువురు అనుకుంటున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పాకాల మండలంలో రాజకీయాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

గర్భిణులకు భోజనాలు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: జనవిజ్ఞాన వేదిక, గూడూరు వారి ఆధ్వర్యంలో సిద్దూ అలర్జీ, ఊపిరితిత్తుల హాస్పిటల్ వైద్యులు హరిప్రసాద్ ధాతత్వంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వచ్చిన నిరుపేద గర్భిణులకు వెజిటేబుల్ రైస్, గుడ్డు, అరటి పండు, వాటర్ బాటిల్స్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన హరిప్రసాద్ ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక వారు నిరుపేదలైన గర్భిణులకు ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో భోజనాలు పంపిణీ చేసే అవకాశం నాకు కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. హరిప్రసాద్ ఇప్పటి వరకు 200 కి పైగా ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. చెంచునారాయణ, కటకం శ్రీను, జగదీష్, ప్రభాకర్, మస్తాన్, బ్లడ్ బ్యాంక్ వైద్యులు సాయి, రామమోహన్, విజయ్‌బాబు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట సోమవారం వైఎస్సార్ విద్యార్థి విభాగం రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జ్ వి.హరిప్రసాద్ రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో మునుపెన్నడూ లేనివిధంగా అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద కార్యక్రమాలతో పేద విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో చదువుకొనే అవకాశం కల్పిస్తున్నారని వెల్లడించారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందని, అందులో భాగంగానే ప్రతి ఏటా విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చలివేంద్రాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ రెడ్డి, గోపాలరెడ్డి, హేమంత్ రెడ్డి, శివ కష్ణ యాదవ్, చందు, రమణ, చరణ్, సదా పాల్గొన్నారు.

అనర్హత వేటు నిర్ణయం బాధాకరం

ప్రజాశక్తి-కోట: రాహుల్ గాంధీపై ఎంపీగా అనర్హత వేటు నిరణయం చాలా బాధాకరమని సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బీజేపీ, వైసీపీకి మిత్రుడైన అదానీకి రూ.22 వేల కోట్ల నల్లధనం ఎక్కడి నుండి వచ్చిందని ప్రశ్నించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు జవాబు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గూడూరు: గంజాయి పట్టుకున్న సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక రెండో పట్టణ పరిధిలోని సెబ్ కార్యాలయంలో డిఎస్‌పి జానకిరామ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. సబ్ సీఐ పి.విజయ్ కుమార్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గూడూరు పరిధిలోని ఓల్డ్ బైపాస్ రోడ్ పొదల వద్ద దాడులు చేసి నిందితుల నుంచి 26 కేజీల గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులు చెరుకూరి వెంకటేశ్వర్లు, బలరామయ్యలుగా గుర్తించారు. వీరు వెంగళ రావు నగర్, నెల్లూరు సంబంధించిన వ్యక్తులుగా తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎ శేషమ్మ, హెచ్‌సిఎం కిరణ్ సింగ్, రమేష్, ఆనంద్ కష్ణ, బాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ మంజూరు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని పివి కండ్రిగ గ్రామ పంచాయతీలోని క్రిష్ణాపురం ఎస్టీ కాలనీకి బస్ షెల్టర్ కలగా మిగిలింది. గత టిడిపి ప్రభుత్వంలో ఎన్నో వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. రాష్ట్ర సీఎం జగనన్న ప్రభుత్వంలో గత నెలలో తిరుపతి పార్ల మెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తిని కష్ణాపురం గ్రామ ప్రజలు కలిసి వినతిపత్రం ఇవ్వగా వెంటనే స్పందించి గ్రామానికి బస్ షెల్టర్ మంజూరు చేసినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. దీంతో క్రిష్ణా పురం ప్రజలు సంతోషం వ్యక్తం చేసి ఎంపికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల సేవకే రెవెన్యూ శాఖ

ప్రజాశక్తి-బాలాయపల్లి: ప్రజలకు సేవ చేసేందుకు రెవెన్యూ శాఖ ఉండేదని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కడగుంట గ్రామంలో వివాదాస్పదంగా ఉన్న బండ్ల బాటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బండ్ల బాటకు సంబంధించి ఇరువైపులా అనేక మంది ఆక్రమించారన్నారు. ఈ విషయమై ఒక్కరికే ఎందుకు నోటీసులు ఇచ్చావని విఆర్ఓపై మండిపడ్డారు. అంతేకాకుండా బండ్ల బాట వివాదం పరిష్కార మార్గం చేపట్టాలని రెవెన్యూ పంచాయతీ అధికారులకు ఆదేశించారు. గ్రామంలోని వివాదాస్పద భూమిని కూడా పరిశీలించినట్లు తెలిపారు. చెరువు ఊట వల్ల వ్యవసాయ భూములు పంటలు వేసుకోవడానికి పనికిరాకుండా పోతాయని కడగుంట గ్రామ రైతులు ఆయన దష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవిన్యూ శాఖ అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించి ఊట నీరు వెళ్లేందుకు ప్రత్యేకమైన ప్రత్యామ్నయం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న భూ సమస్యలపై రెవెన్యూ సిబ్బంది వెంటనే స్పందించి తక్షణమే పరిష్కార మార్గం చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ పూర్ణ, సర్వేయర్ వెంకన్న బాబు, వీఆర్వో మేకలయ్య, గ్రామ సర్పంచి తదితరులు ఉన్నారు.

జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులుగా హేమకుమార్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులుగా హేమకుమార్ ఎన్నికయ్యారు. ఆ సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ ఎన్నికలను ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌దేవ్ ఆధ్వర్యంలో చీఫ్ కోచ్ సయ్యద్, వెంకటేశ్వరరావు, ఇంటర్నేషనల్ బాక్సర్ జి.రమ్మ, తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు వై.ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులు హేమకుమార్, ప్రధాన కార్యదర్శిగా కైలాస్‌ప్రదాన్, కోశాధికారిగా సాయి శివ, ఉపాధ్యక్షులుగా వి.రాజా, శివకుమార్‌రెడ్డి, సాయి కిరణ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కమిటి నాలుగు సంవత్సరాల పాటు కొనసాగుతుంది. ద్రోణాచార్యా అవార్డు గ్రహీత హాయ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశాఖపట్టణం నుంచి జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు ఎన్నో మెడల్స్ సాధించారని, తిరుపతి జిల్లా నుంచి పథకాలు సాధించే దిశగా కృషి చేస్తామని తెలిపారు.

కంటి చూపుకు మంత్రి భరోసా

ముగిసిన శిబిరం, 2800 మందికి చికిత్స

ప్రజాశక్తి- నగరి: కంటి సమస్యలున్న వారికి ఉచిత చికిత్స అందించడానికి, కంటి పొరలున్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిం చడానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్కేరోజా తన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా శంకర నేత్రాలయ సహకారంతో 8 రోజుల పాటు నగరిలో కంటి వైద్యశి బిరాన్ని నిర్వహించారు. మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద జరి గిన ఈ శిబిరానికి 8 రోజుల్లో 2800 మంది పేషంట్లు చికిత్స నిమిత్తం విచ్చేశారు. 93 రకాల కంటికి సంబందిత వ్యాధులను పరిశీలించిన వైద్యులు వీరిలో 400మందిని వివిధ కంటి చికిత్సల నిమిత్తం శంకరనేత్రాలయ బేస్ సెంటర్‌కు తరలించారు. కంటి పొర సమస్య ఉన్న 250మందికి చికిత్స జరిగిన ప్రాంతంలోనే నొప్పిలేకుండా, కుట్లు లేకుండా అత్యాధునిక పద్ధతిలో ఆపరేషన్ చేసి రెండు గంటల వ్యవధిలో వారిని ఇంటికి పంపారు. ఐఓఎల్ లెన్స్, కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందించారు. చివరి రోజున ఆపరేషన్ చేసుకున్న వారిని మంత్రి ఆర్కే.రోజా పరామర్శించారు. అందరినీ పేరుపేరునా పలకరించి ఇక ఎలాంటి సమస్య ఉండదని కంటి చూపు బాగా కనబడుతుందని వైద్యులతో కలిసి భరోసా ఇచ్చారు. అందరికీ తన నివాసం వద్దే భోజనం పెట్టి వారిని ఇళ్లకు పంపించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ అభివృద్ధి

ఎమ్మెల్యే కిలివేటి

ప్రజాశక్తి-దొరవారిసత్రం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తోనే సంక్షేమ అభివద్ధి సాధ్యమవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని మోదుగులపాలెం పంచాయతీ బురదమడుగు గ్రామాలలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజీవయ్య గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి పేదల అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి కరపత్రాలు అందజేస్తూ వారికి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ దువ్వూరు బాల చంద్రారెడ్డి, వైసీపీ మండల అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, నాయకులు బాబురెడ్డి, ఎస్సై తిరుమల రావు, వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నాయుడుపేట: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ, భవిష్యత్ తరాలకు భరోసానిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని నాయుడుపేట మున్సిపాలిటీ 24వ వార్డు కౌన్సిలర్ దారా రవి కోరారు. సోమవారం ఎమ్మెల్యే సంజీవయ్య సూచనల మేరకు 24వ వార్డులో ఆయన, వైకాపా సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, నాయుడుపేట జెసిఎస్ ఛైర్మన్ లాయర్ కుమార్, మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ జలదంకి వెంకట కష్ణారెడ్డి లతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు, గహసారథులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కెవిబి పురం: మండలంలోని ఆరే గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ రాష్ట్ర సీఎం జగన్ మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముని లక్ష్మీ నందకుమార్, రాష్ట్ర హిస్టరీ అకాడమిక్ డైరెక్టర్ గవర్ల కష్ణయ్య, జడ్పిటిసి మూర్తి

మునెమ్మ సుబ్బయ్య, వైస్ ఎంపీపీ దేరాల శ్రీనివాసులు, వైసీపీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం మండలంలోని తలారి వెట్టు సచివాలయం పరిధిలోని తలారి వెట్టు ఎస్‌టి కాలనీలో బిఎన్ కండ్రిగ మండల అధ్యక్షులు ఆరణి విద్యానందరెడ్డి, పి.తిరుపాలు, జె.మునస్వామి ఆధ్వర్యంలో వాలంటీర్స్, గహ సారథులు ప్రతి ఇంటికీ తిరిగి జగనన్న పంపిన సందేశాన్ని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు, వాలంటీర్స్ యోగేశ్వరి, గహ సారథులు సుప్రజ, సతీష్ కుమార్, సిసింద్రీ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పట్టణంలోని పురపాలక సంఘ పరిధిలోని 11వ వార్డులో సోమవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆ వార్డు కౌన్సిలర్ జాన్ కెనడి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కెనడి ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో గహ సారథులు నరసింహులు, అలిమేలు, వైసిపి నాయకులు ప్రసాదు, పురుషోత్తం, రమేష్, రఘుపతి, త్యాగరాజు, రత్నం, గోవింద్ స్వామి తదితరులు పాల్గొన్నారు.